# సినీ రంగం నుంచి ఉద్భవించిన మహా వ్యాపారి!



హీరోగా, క్యారెక్టర్ నటుడిగా విభిన్న పాత్రలు పోషించిన నటుడాయన. చిత్రపరిశ్రమకు వచ్చిన కొత్తలో ఆయన ముద్దు పేరు 'చేటపర్రు చిన్నోడు'. ఆ నటుడు మురళీ మోహన్. తెలుగు చిత్ర సీమలో అత్యంత సంపన్నులలో ఆయనొకరు. కుటుంబ గాథా చిత్రాలకు ఒకప్పుడు పెట్టింది పేరు. ఆయన నటించిన సినిమాలు మహిళలను పెద్ద ఎత్తున ఆకర్షించేవి. మురళీ మోహన్ జన్మదినోత్సవ సందర్భంగా అందిస్తున్న ఈ ప్రత్యేక వ్యాసంలో ఆయన సినీ జీవిత విశేషాలు కొన్ని తెలుసుకుందాం.

ముందుగా మురళీమోహన్‌కు జన్మదిన శుభాకాంక్షలు చెబుతూ...

సాధారణంగా ఎవరైనా సినీ రంగంలో కెరీర్‌ను మలుచుకోవడానికి నానా తిప్పలూ పడుతుంటారు.'సినిమా రంగంలో ప్రవేశించడం నా కల, జీవితాశయం, డాక్టర్ని కాబోయి యాక్టరయ్యా!' వంటి కబుర్లెన్నో చెబుతారు. మరి మురళీమోహన్‌ను అదే విషయమై ప్రశ్నిస్తే 'సినీ జీవితమే పరమావధి కాదు. సినిమా అసలు నా లక్ష్యమే కాదు' అని అంటారు. అలా అన్న మురళీ మోహన్ నిజానికి వ్యాపారవేత్త. రియల్ ఎస్టేట్ వ్యాపారానికి ఇప్పుడున్న బూమ్‌ను ఎన్నో సంవత్సరాల క్రితమే పసిగట్టగలిగిన ముందుచూపున్నదాయనకు.

ఎన్ని రకాల చిత్రాలలో నటించినా మురళీ మోహన్‌కు పేరు తెచ్చినవి 'పెద్దన్నయ్య' తరహా పాత్రలే. మన ఊరి పాండవులు, గ్యాంగ్ లీడర్, శివ తదితర చిత్రాలలో ఆయన నటించినవి ఇటువంటి పాత్రలలోనే. నటుడిగా ఆయన జీవితం ప్రారంభించి, నిర్మాతగా, వ్యాపారవేత్తగా రాణించారు. మురళీ మోహన్ స్థాపించిన జయభేరి పతాకంపై విడుదలైన సినిమాలు విజయ దుందుభి మోగించాయి. 1975 -85 మధ్య కాలం ఆయన సినీ జీవితంలో అత్యున్నత స్థితి.

క్రమంగా వెండితెరకు దూరమైనా సినిమా రంగానికి దూరం కాలేదాయన. నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లకు సేవలందించారు. కొన్ని టెలివిజన్ ధారావాహికలలో కూడా నటించిన మురళీమోహన్ తెలుగు సినీ ప్రేక్షకులపై తన అభిప్రాయం ఇలా చెబుతారు -"తెలుగు సినిమా ప్రేక్షకులను మిగిలిన రాష్ట్రాలలోని సినీ ప్రేక్షకులతో పోల్చలేం. తెలుగు వారికి ఒక్క సినిమాలోనే అన్నీ కావాలి. సెంటిమెంట్, కామెడీ, ఫైట్స్, రొమాన్స్, డ్రామా ఇలా అన్నీ అందించిన సినిమాలే విజయవంతం అవుతాయి" అని ఆయన చెప్పిన మాటలు నేటి నిర్మాతలకు మార్గదర్శకం.